పోలీస్ శాఖ గౌరవం పెంచాలి : ఎఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్ : పోలీస్ శాఖ గౌరవం, ప్రతిష్ట పెంచే విధంగా పోలీసుల వాహనాల నిర్వహణ ఉండేలా డ్రైవర్లు మరింత క్రమశిక్షణతో విధి నిర్వహణ చేయాలని ఎఎస్‌పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో మొబిలైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లందరూ లైసెన్స్ కలిగి ఉండాలని, పోలీస్ శాఖ గౌరవం మీ చేతుల్లో ఉందనే విషయం గుర్తుంచుకుని చెప్పారు. క్రమశిక్షణతో విధి నిర్వహణ చేస్తూ వాహనాల నిర్వహణ సక్రమంగా చేయాలని సూచించారు. ఎఆర్ అదనపు ఎస్‌పి బి.రమణయ్య మాట్లాడుతూ హైవేల మీద ప్రయాణం చేసే సమయంలో వేగ పరిమితిని విధిగా పాటించాలని, వాహనాల ఇంజన్ ఆయిల్, బ్రేక్, క్లచ్ అయిల్స్, కూలెంట్ అయిల్స్ ను ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. ఎ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసరావు, ఎం.టి విభాగ ఆర్.ఐ వీరేష్, ట్రాఫిక్ సి.ఐ జావేద్, ఎం.వి.ఐ ప్రసాద్, మహీంద్రా ఆటోమొబైల్స్ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

'హౌసింగ్' అరకొరే

జిల్లాలో వంద రోజుల హౌసింగ్ ప్రణాళిక లక్ష్యానికి ఆమడదూరంలో నిలిచింది. 2024 డిసెంబర్ నాలుగో వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా 1.14 లక్షల పక్కా గృహాలను ప్రారంభించాలనే లక్ష్యాన్ని రాష్ట్ర హౌసింగ్ యంత్రాంగం నిర్దేశించింది. క్షేత్రస్థాయి పరిస్థితుల మదింపుతో ఆచరణ సాధ్యంకాదని గుర్తించింది. ఫిబ్రవరి ఒకటిన పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ముఖ్యమంత్రి చేతుల మీదుగా భారీగా పక్కాగృహాలను ప్రారంభించాలని నిర్ణయించింది. రాష్ట్ర హౌసింగ్ ఉన్నతాధికారులకు జిల్లా హౌసింగ్ యంత్రాంగం తొమ్మిది వేల పక్కాగృహాలను పూర్తి చేయడానికి ప్రణాళిక రూపొందించుకుంది. క్షేత్రస్థాయి పరిస్థితుల మదింపు అనంతరం పక్కాగృహాల లక్ష్యాన్ని ఆరు వేలకు కుదించుకుంది. మరోసారి కుదించిన లక్ష్యమూ సాధ్యంకాని భావించి ఫిబ్రవరి ఒకటి నాటికి 3,544 పక్కాగృహాలను ప్రారంభించడానికి కసరత్తు చేస్తోంది. లక్ష్యానికి అవతల మిగిలిపోయిన మూడు వేల పక్కా గృహాల లక్ష్యాన్ని రాబోయే మూడు నెలల ప్రణాళికలో పూర్తి చేయనున్నట్లు చెబుతోంది.

- 60 శాతం పక్కా గృహాలతో సరి
- ఒకటిన గృహ ప్రవేశాలకు కసరత్తు
- రూ.12 కోట్ల బకాయి కోసం నిరీక్షణ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో పక్కాగృహాల ప్రారంభోత్సవాలకు కసరత్తు ఊపందుకుంది. జిల్లా హౌసింగ్ యంత్రాంగం వంద రోజుల ప్రణాళిక ఆచరణకు ఆమడ దూరంలో నిలిచిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి ఒకటి నాటికి పూర్తి చేసిన 3,544 పక్కాగృహాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తోంది. కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో వంద రోజుల ప్రణాళికలో భాగంగా డిసెంబర్ నాలుగోవారం నాటికి జిల్లాలో ఆరు వేల పక్కాగృహాలను పూర్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించింది. జిల్లా హౌసింగ్ యంత్రాంగం పక్కాగృహాల లక్ష్యానికి అనుగుణంగా ముందుకు కదిలింది. 3,544 పక్కాగృహాల నిర్మాణాలను మాత్రమే పూర్తి చేసింది. ఈలెక్కన 60 శాతం పక్కాగృహాల నిర్మాణాలను పూర్తి చేసినట్లు కనిపిస్తోంది.

ప్రోటోకాల్ తంటాలు

పక్కాగృహాల ప్రారంభోత్సవాలకు హౌసింగ్ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పులివెందుల, బద్వేల్ తదితర అసెంబ్లీ పరిధిలోని ప్రజాప్రతి నిధుల్లో ఎవరిని పిలవాలనే మదనపడుతోంది. గెలిచిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను కాదని, ఓడిన వారిని పిలిస్తే ఎలా ఉంటుందనే సందిగ్ధంలో పడినట్లు కనిపిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటి నాటికి పూర్తి చేసిన 3,000 పక్కాగృహాలను జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ప్రజా ప్రతినిధుల సమక్షంలో ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఆయా ప్రజాప్రతినిధులకు సమాచారం అందజేసినట్లు తెలుస్తోంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఎంపిక చేసిన రెండు, మూడు పక్కాగృహాలను ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమైంది.

బకాయిలతో బేజారు

జిల్లాలోని హౌసింగ్ లబ్ధిదారులకు చెల్లింపులు చేయడంలో జిల్లా హౌసింగ్ యంత్రాంగం తంటాలు పడుతోంది. హౌసింగ్ పీడీ నిద్రాణస్థితిలోని పక్కాగృహాలను పట్టాలెక్కించడానికి శక్తివంచన లేకుండా చేసిన కృషి బకాయి చెల్లింపుల దగ్గర వెలవెలబోతోంది. మూడు నెలల కిందట రూ.12 కోట్ల బకాయి చెల్లింపులను గుర్తించింది. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. మూడు నెలలుగా స్పందన కొరవడింది. పలువురు హౌసింగ్ లబ్ధిదారులకు చెల్లింపులు చేయలేని పరిస్థితి నెలకొంది. హౌసింగ్ లేఅవుట్లలో నిద్రాణస్థితిలో పక్కాగృహాల లబ్ధిదారులను చైతన్యపరచడం, ఇళ్ల నిర్మాణ పనుల్ని పట్టాలెక్కించడం, పెండింగ్ బకాయి విడుదల చేయని ప్రతికూల పరిస్థితుల్లో పక్కాగృహాల లక్ష్యాన్ని అందుకోవడం తీయించడం సవాలుతో కూడిన వ్యవహారంగానే చెప్పవచ్చు.

మిగిలిన పక్కాగృహాలను పట్టాలెక్కిస్తాం

వంద రోజుల ప్రణాళిక లక్ష్యానికి అవతల మిగిలిపోయిన పక్కాగృహాల నిర్మాణాలను పూర్తి చేయిస్తాం. రాబోయే మూడు నెలల ప్రణాళికలో మిగిలిపోయిన వారికి ప్రాధాన్యత ఉంటుంది.

- రాజారత్నం, హౌసింగ్ పీడీ, కడప.

పిల్లల పండుగను విజయవంతం చేయండి

ప్రజాశక్తి కడప అర్బన్

కడప బాలోత్సవం రెండవ పిల్లల పండుగ విజయవంతం చేయాలని కడప బాలోత్సవ జిల్లా కమిటీ అధ్యక్షులు గోపాల్, గౌరవాధ్యక్షులు నాగముని రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఎస్.వి. ఇంజినీరింగ్ కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 1, 2 తేదీల్లో సెయింట్ జోసెఫ్ బాలుర ఉన్నత పాఠశాల కడపలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులు ఈనెల 31లోపు అందజేయాలని కోరారు. మొదటి రోజు సైన్స్ ఎగ్జిబిషన్, మట్టితో బొమ్మలు, వ్యాసరచన, కథారచన, వార్తా పఠనం, కథలు చెప్పడం, బెస్ట్ ఫ్రం వేస్ట్, కార్టూన్ గీయడం, మెమరీ టెస్ట్, క్లాసికల్ డాన్స్, జానపద నృత్యం, విచిత్ర వేషధారణ, ఏకపాత్రాబినయం, ఫాన్సీ డ్రెస్, తెలుగు, ఉర్దూ ,ఇంగ్లీష్, రైమ్స్ ఉంటాయని చెప్పారు. రెండవ రోజు చిత్రలేఖనం, వక్తృత్వం, తెలుగు డిక్టేషన్, మ్యాప్ పాయింటింగ్, కోలాటం, జానపద నృత్యం (సీనియర్స్)లఘు నాటికలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, ప్రతిభ పాటవాలను వెలికి తీయడానికి బాలల దినోత్సవం మొదలు పెట్టామని తెలిపారు. మొదటి పిల్లల పండగ తర్వాత కడప బాలోత్సవ కమిటీ ఏర్పడిందని చెప్పారు. ఈ కమిటీ నిర్వహించే కార్యక్రమాలను దాతల సహకారంతో చేస్తున్నామని పేర్కొన్నారు. కడప బాలోత్సవ కమిటీలు రిటైర్డ్ ఆఫీసర్లు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులతో ఏర్పడిందని తెలిపారు. యూనివర్సిటీ, ఉపాధ్యాయుల సహకారంతో కార్యక్రమాలు విజయవంతంగా చేస్తున్నామని చెప్పారు. వీర సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ బాలల కోసం ఇంత పెద్ద కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. రెండవ పిల్లలు పండగకు దాదాపు 5,000 నుంచి 8000 మంది వరకు హాజరవుతున్నారని తెలిపారు. రెండు రోజులపాటు నిర్వహించు కార్యక్రమాలను కడప పుర ప్రజలందరూ విచ్చేసి తిలకించి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్, ప్రచార కార్యదర్శి శివరాం, ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కమిటీ అధ్యక్షులు గోపాల్

పోలీసుల వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

పోలీసుస్టేషన్ ఎదుట మృతుడి కుటుంబ సభ్యుల ధర్నా

సిఐ హామీతో ఆందోళన విరమణ

పురుగుల మందు డబ్బాతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మృతుడు ఆర్. గంగాధర, ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పోలీసుల వేధింపులు తాళలేక పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట చోటు చేసుకుంది. వివరాలు.. మండల పరిధిలోని మొట్నూతలపల్లెకు చెందిన రెడ్డిబోయిన గంగాధర (32) ఈనెల 25న అదే గ్రామానికి చెందిన గడ్డం గంగాధర్‌పై దాడి చేశాడు. గాయపడిన గంగాధర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. రెడ్డిబోయిన గంగాధరను పోలీసులు ఇబ్బందులు పెడుతుండడంతో అవమానం భరించలేక మంగళవారం పోలీస్‌స్టేషన్ ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు చికిత్స కోసం అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఈ విషయంపై సిఐ మాట్లాడుతూ గంగాధర అనే వ్యక్తి తమ గ్రామానికి చెందిన గంగాధర్ భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని తెలిపారు. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ చేసినా గంగాధరలో మార్పు రాలేదన్నారు. ఈనేపథ్యంలో వారిద్దరు ఈనెల 25న ఘర్షణ పడ్డారని, గాయపడిన గడ్డం గంగాధర్ అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. దీంతో పోలీసులు అటెంప్ట్ మర్డర్ కింద కేసు నమోదు చేశారని చెప్పారు. కేసు విచారణలో భాగంగా ఆర్. గంగాధర్ కోసం గాలింపు చర్యలు చేపడుతుండగా తప్పించుకుని తిరిగేవాడన్నారు. మంగళవారం పురుగుల మందు డబ్బా తీసుకొని వచ్చి స్టేషన్ ముందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని సిఐ తెలిపారు.

పోలీసుస్టేషన్ ఎదుట కుటుంబ సభ్యుల ధర్నా

పోలీసులు వేధిస్తున్నారని రెడ్డి బోయిన గంగాధర పోలీస్ స్టేషన్‌లో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. తమ కుటుంబానికి న్యాయం చేయాలంటూ అతని కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ దగ్గర ధర్నా దిగారు. తండ్రి కృష్ణయ్య , తల్లి నరసమ్మ, భార్య సౌజన్య ముగ్గురు కూతురు, కొడుకు ఆత్మహత్యకు కారణం పోలీసుల వేధింపులే కారణమని, న్యాయం జరగాలని ఆందోళన చేపట్టారు. సిఐ నరసింహులు కుటుంబ సభ్యులతో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు.

సమస్యలు డిఎల్ఎస్ఎ దృష్టికి తీసుకురావాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప : ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ (డిఎల్ఎస్ఎ) దృష్టికి తీసుకురావాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ వృద్ధులకు సూచించారు. మంగళవారం కడప నగరం ఇందిరానగర్‌లో ఉన్న వెంకటేశ్వర వృద్ధాశ్రమాన్ని జడ్జి బాబా ఫక్రుద్దీన్ సందర్శించారు. వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. కార్యక్రమంలో పద్మావతి వెంకటేశ్వర ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

నాగభూషణం కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - గోపవరం : శ్రీ రాచపూడి నాగభూషణం కళాశాలలో బద్వేల్ ప్రభుత్వాసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నేవి లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ బాలాజీ గౌతమ్ గవే శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం వల్ల ఇతరుల ప్రాణాలను కాపాడవచ్చన్నారు. పైగా అనేక ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. రక్తపోటు తగ్గి శరీరంలో సమతుల్యత ఏర్పడుతుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఆయన కోరారు. 53 మంది కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. బద్వేల్ మండలం కొంగలవీడు దగ్గర జరిగే బోట్ ట్రైనింగ్ క్యాంపును కమాండర్ గణేష్ బాలాజీ గౌతమ్ గవే సందర్శించి ప్రారంభించారు. కార్యక్రమంలో నేవి సిబ్బంది కైలాష్ కుమార్, జగదీప్ చౌహాన్, లోకేష్, బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి, కళాశాల పరిపాలన అధికారి సాయి కృష్ణ, ప్రిన్సిపల్ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇ-ఆఫీస్ విధానం అమలు చేయాలి

ప్రజాశక్తి - కడప : కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇ-ఆఫీస్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ పిజిఆర్ఎస్ హాలులో జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు, టైపిస్టులు, సిబ్బందికి ఇ-ఆఫీస్ నిర్వహణపై ఎన్ఐసి ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇ-ఆఫీస్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్ఫర్మేషన్ అధికారి డాక్టర్ టి.ఆర్. విజయ్ కుమార్, ఇ-ఆఫీస్ టెక్నికల్ అసిస్టెంట్స్ శ్రీనివాస రావ్ అనిల్ కుమార్ రెడ్డి, టైపిస్టులు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రానికి చంద్రబాబు ఒక పరిశ్రమ

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్రానికి ఒక పరిశ్రమ ముఖ్యమంత్రి చంద్రబాబు అని పార్టీ టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ద్వారకా నగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు చంద్రబాబు కృషి ఎంతో అవసరమని చెప్పారు. ఆయన ఎక్కడ ఉంటే పరిశ్రమలు వెంటే ఉంటాయని కొనియాడారు. యువ నాయకులు లోకేష్ పాదయాత్ర చేసి రెండు సంవత్సరాలు అయిందని తెలిపారు. రాష్ట్రంలో రాక్షస పాలన అంతమందించేందుకు 9 నెలలు పాటు తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ పాదయాత్ర చేశారని చెప్పారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చేందుకు రాష్ట్రాన్ని పరిశ్రమల హబ్ గా మర్చేందుకు ఇటీవల దావోస్ పర్యటనని నిదర్శనం అన్నారు. ఐదు సంవత్సరాలలో వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి తీసుకెళ్లిందని తెలిపారు. ఆ ఊబి నుండి బయటపడేందుకు రెండు సంవత్సరాలు పడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని ప్రజలకు అందిస్తుందని భరోసా ఇచ్చారు.

యువగళం పాదయాత్రే పార్టీ గెలుపునకు నాంది

ప్రజాశక్తి - కడప అర్బన్ : యువగళం పాదయాత్ర తెలుగుదేశం పార్టీ గెలుపునకు నాంది అని టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు ఉపాధ్యక్షులు ఏటూరి లోకేష్ అన్నారు. మంగళవారం టిఎన్ ఎస్ఎఫ్ నగర కమిటీ కార్యాలయం యువగళం పాదయాత్ర ప్రారంభమై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. ముఖ్యఅతిథిగా టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసా పేట శివ హాజరై కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023, జనవరి 27న ప్రారంభమైన నారా లోకేష్ చారిత్రాత్మక యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాలలో విప్లవాత్మక మార్పుకు నాంది పలికిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ మీడియా కో-ఆర్డినేటర్ విశ్వనాథ్, ఎన్ఆర్ఐ కువైట్ ఉపాధ్యక్షులు రహవ ఎతుల్లా, 24వ డివిజన్ శేఖర్, నరసింహ, నగర కమిటీ నాయకులు రాఘవ, శ్రీకాంత్, కళ్యాణ్, నారాయణ చైతన్య, వెంకట్, ఆనంద్, గౌస్, జన పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఉర్దూ పాఠశాలలను బలోపేతం చేయండి : 'రూట'

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలోని ఉర్దూ మాధ్యమ ప్రాథమికోన్నత పాఠశాలలన్నింటిని ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించాలని తద్వారా మైనారిటీ విద్యార్థుల డ్రాప్ అవుట్ శాతం భారీగా తగ్గుముఖం పడుతుందని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, జుబేర్ అహ్మద్ అన్నారు. మంగళవారం నూతన డిఇఒ డాక్టర్ ఎస్.షంషుద్దీన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒ. నంబర్ 117 రద్దు అనంతరం జిల్లా వ్యాప్తంగా పాఠశాలల పునర్నిర్మాణంలో భాగంగా ఉర్దూ పాఠశాలలను, తరగతులను ఎట్టి పరిస్థితుల్లోనూ తెలుగు లేదా ఆంగ్ల మాధ్యమ పాఠశాలలలో కానీ, నమూనా పాఠశాలలలో కానీ అనుసంధానం, తరలింపు చేయరాదని స్పష్టమైన ఆదేశాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో రూట రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సత్తార్ ఫైజి, అబ్దుల్ హకీమ్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ అయ్యూబ్, డిఇఒ కార్యాలయం ఎడి మునీర్ ఖాన్, సూపరింటెండెంట్ బాదుల్లా, రాష్ట్ర డైరెక్టర్ సయ్యద్ సిరాజుద్దీన్, రాష్ట్ర కౌన్సిలర్ బిఖారి ఫక్రుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ అస్లం, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ దావూద్, జిల్లా ఆర్థిక కార్యదర్శి కరామతుల్లా పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక భావోద్వేగ వికాసాలు : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్ : మానసిక భావోద్వేగ వికాసానికి దోహదపడేందుకు ధ్యానం టానిక్‌లా పనిచేస్తుందని వైవియూ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం సైన్స్ బ్లాక్ లోని సెమినార్ హాల్‌లో విశాఖపట్నంలోని దివ్య బాబాజీ సుషుమ్న యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధ్యానం పై శిక్షణ తరగతులను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ మన మనస్సు ఆందోళన నుంచి విముక్తి పొంది ప్రశాంతతను ఇవ్వడంలో ధ్యానం సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ దివ్య బాబాజీ సుషుమ్న యోగా ఫౌండేషన్ కార్యదర్శి ఆర్.శిరీష , అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్‌లు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కాశినాయన : నెల్లూరులో ఫిబ్రవరి 3న నిర్వహించే సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్ పేర్కొన్నారు మంగళవారం కాశినాయనలో ఆయన మహాసభకు సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు, సామాన్యులకు అండగా ఉండేది సిపిఎం అన్నారు. నెల్లూరులో జరిగే మహాసభలకు ప్రతి ఒక్కరు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ పోలయ్య వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వీరయ్య పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీలో పంజాబ్ జట్టు విజయం

ప్రజాశక్తి - కడప : కల్నల్ సి కె నాయుడు ట్రోఫీ అండర్-23 మల్టీ డే క్రికెట్ టోర్నీలో భాగంగా కడపలోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్‌లో ఆంధ్ర జట్టుపై ఐదు వికెట్ల తేడాతో పంజాబ్ జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 211 పరుగులు చేసింది. పంజాబ్ జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 119 పరుగులు చేసింది. రెండవ ఇన్నింగ్స్‌లో ఆంధ్ర జట్టు 162 పరుగులు చేసింది. దీంతో ఆంధ్ర జట్టు 255 పరుగుల విజయ లక్ష్యాన్ని పంజాబ్ జట్టు ముందుంచింది. ఒక వికెట్ నష్టానికి 115 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ కు దిగిన పంజాబ్ జట్టు 83.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగులు చేసి 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆ జట్టులోని జస్కరన్వీర్ సింగ్ 73, ఉదయ్ సహారన్ 71, రాహుల్ కుమార్ 56 (నాటౌట్) పరుగులు చేశారు. ఆంధ్ర జట్టులోని సాకేత్ రామ్, కె.ఎస్. రాజు చెరో రెండు వికెట్లు తీసుకున్నారు.

గంజాయిని అరికట్టాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని రవీంద్ర నగర్ ప్రాంతంలోని యువత గంజాయి బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, గంజాయి నివారణకు చర్యలు తీసుకోవాలని అల్ హబీబా విద్యాసంస్థల చైర్మన్ లయన్ పఠాన్ అక్బర్‌ఖాన్ విజ్ఞప్తి చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌పి ఇ.జి. అశోక్‌కుమార్‌ను మంగళ వారం సీనియర్ పోలీస్ ఆఫీసర్ల విశ్రాంతి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినంద నలు తెలిపారు. ఈ సందర్భంగా అక్బర్ ఖాన్ మాట్లాడుతూ ఎస్‌పి అశోక్ కుమార్ 2014 నుంచి 2017 వరకు కడప డిఎస్‌పిగా చేసినప్పుడు జిల్లా ప్రజల కోసం ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. స్వతహాగా ఒక సామాన్య టీచరుగా తన జీవితాన్ని ప్రారంభించి గ్రూప్ టాపర్‌గా ఎదిగి, డిఎస్‌పి స్థాయి నుంచి అనతి కాలంలోనే అడిషనల్ ఎస్‌పిగా ఉద్యోగోన్నతి పొందారన్నారు. జిల్లాలోని యువతను సన్మార్గంలో నడిపించేందుకు ఎస్‌పి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.



ఎస్‌పిని సన్మానిస్తున్న పఠాన్ అక్బర్‌ఖాన్

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న హీరోయిన్ అప్సర రాణి

కొత్త కోణంలో 'రాచరికం'

ప్రజాశక్తి - కడప అర్బన్

రాచరికం సినిమా కొత్త కోణంలో రాయలసీమ ఇతివృత్తాంతంగా మహిళా శక్తిని తెలియజేసే సన్నివేశంతో తీశామని యూనిట్ ప్రొడ్యూసర్ ఈశ్వర్, డైరెక్టర్ సురేష్ తెలిపారు. మంగళవారం ప్రెస్ క్లబ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమకు చెందిన అనంతపురం జిల్లాలో జరిగిన ఒక సంఘటనను తీసుకుని మహిళా శక్తిని సినిమాలో చూపించామని పేర్కొన్నారు. హీరోయిన్ అప్సర రాణి మాట్లాడుతూ తొలిసారి కడపకు వచ్చామని చెప్పారు. దర్గాకు వెళ్లి ప్రార్థనలు చేశామని పేర్కొన్నారు. ఇది తన తొలి సినిమా అన్నారు. ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకు వస్తోందని చెప్పారు. ఆదరించాలని కోరారు. హీరో జయ శంకర్ మాట్లాడుతూ రాచరికం టీం ప్రమోషన్ కోసం వచ్చామని తెలిపారు. ఇప్పటి వరకు ఎవరూ చూపాని ఇతివృత్తంతో తీశారన్నారు. ప్రతిఒక్కరూ సినిమా చూసి విజయవంతం చేయాలని కోరారు. వరుణ్ సందేశ్ నటన చాలా గొప్పగా చూస్తారని చెప్పారు. యాక్షన్ మూవీ కాదు, మహిళ ప్రధాన పాత్రతో కథనం నడుస్తుందని చెప్పారు.

ఇచ్చిన మాట తప్పడంలో చంద్రబాబు దిట్ట

ప్రజాశక్తి - కడప

ఇచ్చిన మాట తప్పడంలో చంద్రబాబు నాయుడు దిట్ట అని మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా అన్నారు. చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తుందని, ఈ కాలంలో ఎన్ని హామీలు నెరవేర్చారో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. మంగళవారం కడప నగరంలోని తన నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలపై సిఎం చంద్రబాబు మాట తప్పడం పై ఘాటుగా విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏం అయ్యాయి? అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో ఎన్ని హామీలు నెరవేర్చారో ప్రజలకు స్పష్టం చేయాలి అన్నారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'పై మాట మార్చడం దారుణం

ప్రజాశక్తి - కడప

సూపర్ సిక్స్ పథకాలపై టిడిపి కూటమి ప్రభుత్వం మాట మార్చడం దారుణమని ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలు చేయడంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫల మైందన్నారు. ఎన్నికలకు ముందు ఒక మాట, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక మాట మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి విద్యార్థికి రూ. 15 వేలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు సాధ్యం కాదని చెప్పడం మరి దారుణం అన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మామిళ్ల బాబు

శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణం చేస్తున్న వేదపండితులు

దేవుని కడప బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- నేటి నుంచి వార్షిక ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

దేవుని కడప శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 6 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో అంకురార్పణ కార్యక్రమం మంగళవారం సాయంత్రం 6 గంటలకు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సాయంత్రం 6 గంటలకు మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం అనంతరం శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణం చేశారు. 29న ధ్వజారోహణతో ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు కార్యక్రమం ఉంటుంది. రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారి ఊరేగింపు ఉంటుంది. 30న ఉదయం 9 గంటలకు సూర్యప్రభ వాహనం, రాత్రి పెద్ద శేష వాహనంపై పురవీధుల్లో భక్తులకు దర్శనం ఇస్తారు. 31న చిన్న శేష వాహనం, రాత్రి సింహ వాహనం, ఫిబ్రవరి 1న కల్పవృక్ష వాహనం, రాత్రి హనుమంత వాహనం, 2న ముత్యపు పందిరి ఉత్సవం, రాత్రి గరుడ వాహనం, 3న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, రాత్రి గజ వాహనం, 4న ఉదయం 6 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు రథంపై కొలువతాయి. మధ్యాహ్నం రెండు గంటలకు రథోత్సవం ప్రారంభమవుతుంది. రాత్రి దూళి ఉత్సవం నిర్వహిస్తారు. 5న సర్వభూపాల వాహనం, రాత్రి అస్వ వాహనంపై స్వామివారు దర్శనమిస్తారు. 6న ఉదయం ఎనిమిది గంటలకు వసంతోత్సవం, చక్ర స్నానం, రాత్రి హంస వాహనం, ధ్వజారోహణంతో ఉంటుంది. 7న సాయంత్రం 6 గంటలకు పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

సన్‌రైజ్ హాస్పిటల్
Healing Hands... Caring Hearts...
మల్టీ స్పెషాలిటీ & సూపర్ స్పెషాలిటీ
కోటిరెడ్డి ఉమెన్స్ డిగ్రీకాలేజ్ ప్రక్కన, నాగరాజుపేట, కడప. సెల్:8886655565
అందరికి అందుబాటులో అపూర్వ అనుభవం కలిగిన వైద్యులచే 24 గం॥ వైద్య సేవలు అందిస్తున్న హాస్పిటల్ మన సన్‌రైజ్ హాస్పిటల్
జనరల్ మెడిసిన్ & క్రిటికల్ కేర్ విభాగము: డా॥ పి. రమ్యతా రెడ్డి M.B.B.S., M.D. (Gen. Medicine & Diabetology); డా॥ షేక్ జావిద్ బాష M.B.B.S., M.E.M. (Emergency Medicine)
జనరల్ సర్జరీ విభాగము: డా॥ ఎ. విజయ భాస్కర్ రెడ్డి M.B.B.S., M.S. (Gen. Surgery) Endoscopy & Laparoscopy Surgeon
క్యాన్సర్ (అంకాలజి) విభాగము: డా॥ వి.యం. శంకర్ రెడ్డి M.B.B.S., DNB (Surgical Oncology) Senior Surgical Oncologist
ఆర్థోపెడిక్ విభాగము: డా॥ యం. మధు సూధన్ రెడ్డి M.B.B.S., MS., (Ortho) Bones, Joints & Spine Specialist
కార్డియాలజి విభాగము: డా॥ ఎన్.ఆర్. రాజశేఖర్ రెడ్డి DNB (General Medicine) D.M (Interventional Cordiologist)
మెదడు & వెన్నముక విభాగము: డా॥ డి. జగదీశ్వర్ రెడ్డి M.B.B.S., MCH, (Neuro Surgery); డా॥ పి. సాయి కిరణ్ M.B.B.S., DNB, (Neuro Surgery)
ప్లాస్టిక్ సర్జరీ విభాగము: డా॥ యస్. సోమశేఖర్ M.B.B.S., DNB (Plastic Surgery)
నెఫ్రాలజి విభాగము: డా॥ యస్. సతీష్ రెడ్డి M.B.B.S., M.D. (Nephrology)
యురాలజి విభాగము: డా॥ దినేష్ కుమార్ రెడ్డి M.B.B.S., MS (Gen.Surgery), DrNB (Urology)
గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగము: డా॥ రవికుమార్ రెడ్డి M.B.B.S., MD, DM (Gastroenterology)
ఫిజియోథెరపి విభాగము: డా॥ పి. సతీష్ కుమార్ రెడ్డి B.P.T., M.P.T. Chief Physiotherapist
అన్ని ప్రభుత్వ రంగ ఉద్యోగులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ సౌకర్యం కలదు
అర్హులైన వారికి * డా॥ యన్.టి.ఆర్ వైద్య సేవ (ఆరోగ్య శ్రీ) * EHS * WJHS
పలు రకాల ఇన్సూరన్స్‌ల ద్వారా ప్రతి రోజు ఉచితంగా ఓ.పి. మరియు ఆపరేషన్లు చేయబడును.
వివరములకు సంప్రదించండి : డి. నగేష్, సెల్ : 9000010686, యు. సంజీవ్, సెల్ : 8008520402

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

పథకాల అమలుపై చేతులెత్తేసిన సిఎం

ప్రజాశక్తి - వేంపల్లె

ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో సిఎం చంద్రబాబు చేతులెత్తేయడం దారుణమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఊహించిన దాని కంటే దిగజారి పోయిందని, గాడిన పెట్టాలంటే కొంత ఆలస్యం అవుతుందని, అప్పటి వరకు సంక్షేమ పథకాలు, సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయలేమని సిఎం చంద్రబాబు చెప్పడం దురదృష్టకరమన్నారు. ప్రజలపై పన్నుల భారం వేయ డానికి కూటమి ప్రభుత్వం సిద్ధం కావడం సిగ్గు చేటన్నారు. కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేయడమే అన్నారు. ఎన్నికలకు ముందే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని చంద్రబాబుతో సహా అందరికి తెలుసన్నారు. కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేయడమే అన్నారు. చంద్రబాబు, కూటమి నాయకులు ప్రజలకు క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ధ్రువకుమార్ రెడ్డి, సుబ్రమణ్యం, రామకృష్ణ, చెన్నకేశవ, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, రమణ, సుబ్బ రాయుడు, వేమా రాజా, వేమయ్య, రవి, వెంకటేష్, మహబూబ్ బాషా, మదార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి

- ప్రొద్దుటూరు కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్ బాషా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు ప్రజా సమస్యలను పరిష్కరించకుండా వ్యక్తిగత విమర్శలు చేసుకొంటూ ప్రజలను పట్టించుకోకపోవడం దారుణమని ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్ బాషా పేర్కొన్నారు. స్థానికంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరులో టిడిపి, వైసిపి నేతలు రహస్య మిత్రులుగా ఉంటూ ప్రజలను విసిగిస్తున్నారని విమర్శించారు. మంచినీటి, పారిశుధ్య సమస్యలు, దోమల బెడద, ఇరుకైన రోడ్లు, ట్రాఫిక్ సమస్య, ఇళ్ల పట్టాల వంటి ఎన్నో సమస్యలు ఉన్నా వాటి గురించి వారికి పట్టదని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలను అణచి వేయాల్సింది పోయి యువతను మరింత ప్రేరేపితం చేసేలా విమర్శలు చేసుకోవడం శోచనీయమన్నారు. ప్రజా సమస్యలు గాలికి వదిలేసి గ్యాంబ్లింగ్, బెట్టింగ్, గుట్కా, మట్కా, క్లబ్బులు, డ్రగ్స్ గురించి మాట్లాడుతూ యువతకు తెలియని విషయాలు కూడా తెలియజేస్తూ పరోక్షంగా వారిని చెడగొడుతున్నారని ఆరోపించారు. రూ.160 కోట్లతో మంజూరైన మంచి నీటి పైపులైన్ పనులను రద్దు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. డ్రయినేజీ ఆధునీకరణ, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి ఆగిపోయాయన్నారు. గత వైసిపి ప్రభుత్వ పాలనలో ప్రొద్దుటూరుకు రావాల్సిన మెడికల్ కాలేజీ పులివెందులకు తరలి పోతుంటే అప్పటి ఎమ్మెల్యే మౌనం వహించారన్నారు. ప్రభుత్వాలు మారినా టిడిపి, వైసిపి నాయకుల పనులు సాఫీగా జరుగుతున్నట్లు ఆరోపించారు. కొట్టినట్లు నటిస్తాం, మీరు ఏడ్చినట్లు నటించండి అనే చందంగా ఆ పార్టీల నేతలు రహస్యంగా స్నేహం చేస్తున్నట్లు తెలిపారు.. ఇప్పటికైనా ప్రజా సమస్యలపై పోరాటం చేసే నాయకులకు మద్దతు ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు.

కూటమి పాలనలో బాదుడే బాదుడు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కూటమి పాలనలో బాదుడే బాదుడు అని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కేతిరెడ్డి తిరుపాల్‌రెడ్డి తెలిపారు. స్థానికంగా తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే వివిధ రకాల ఛార్జీలు, పన్నులు పెంచబోమని ఎన్నికల ముందు చంద్రబాబు హామీలిచ్చారన్నారు. ప్రస్తుత పాలన పరిస్థితి చూస్తే వాటిని పెంచకపోతే పాలన మనుగడ సాధ్యం కాదన్నట్లు చంద్రబాబు చెప్తున్నారని చెబుతున్నారన్నారు. ఇందుకు ఫిబ్రవరి ఒకటి నుంచి రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు ఉదారణ అన్నారు. ఇప్పటికే విద్యుత్ ఛార్జీలు పెంచారని, దీనికి కారణం గత ప్రభుత్వం చేసిన అప్పులేనని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వంపై అప్పటి ప్రతిపక్ష నేతగా చంద్రబాబు బాదుడే బాదుడు అంటూ విమర్శించారన్నారు.

లాలా లజపతిరాయ్‌కి ఘనంగా నివాళులు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, దేశ రచయిత లాలా లజపతిరాయ్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ కూడలిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్‌సి సెల్ చైర్మన్ గున్నంపాటి వెంకటరమణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ హాజీ గౌస్, మాజీ డీలర్ కరీముల్లా, రచయిత ఇంతియాజుద్దీన్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

పాఠకుల సభ్యత్వాలు పెంచాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సభ్యత్వాలు పెంచేందుకు కృషి చేయాలని గ్రంథాలయ జిల్లా కార్యదర్శి సయ్యద్ అమీరుద్దీన్ కోరారు. ఆ మేరకు మంగళవారం గ్రంథాలయ అధికారి రాజశేఖర్‌కు పలు సూచనలు చేశారు. స్థానిక గ్రంథాలయాన్ని సయ్యద్ అమీరుద్దీన్ తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. పన్ను బకాయిలు చెల్లించాలని ముద్దనూరు పంచాయతీ ఇఒ లక్ష్మీ నరసింహులును కోరారు.

కొలతల్లో తేడాలుంటే చర్యలు

ముద్దనూరు : స్థలాలు, ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన కొలతల రిజిస్టర్‌లో తేడాలు ఉంటే జరిమానా విధించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కడప ఆడిట్ సబ్ రిజిస్ట్రార్ ఆర్.రాజశేఖర్ తెలిపారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంగళవారం రాజశేఖర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గృహాలు, స్థలాల, కొలతలు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవకతవకలకు పాల్పడి కొలతలు తప్పుగా రిజిస్టర్ చేసుకున్న యజమానులకు జరిమానా విధించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కడప ఆడిట్ సబ్ రిజిస్ట్రార్ తనిఖీకి వచ్చిన సమయంలో ఉదయం 11 గంటలు దాటినా సబ్ రిజిస్ట్రార్, సిబ్బంది కార్యాలయానికి రాకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

సర్వేలో మార్పులు చేయాలి

వేంపల్లె : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మంజూరు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలనే లబ్ధిదారులకు చంద్రన్న సాధికారిక సర్వే ఇబ్బందిగా ఉందని, ఆ సర్వేలో మార్పులు చేపట్టాలని బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 2016లో అప్పటి ప్రభుత్వం ఇంటింటికి సర్వే జరిపి కుటుంబ సభ్యులకు ఐడి నెంబర్లు కేటాయించారన్నారు. ఆ తర్వాత కాలంలో ఆ కుటుంబంలోని సభ్యులు వివాహాలు చేసుకొని వేరుగా నివాసాలు ఉంటున్నట్లు చెప్పారు. ఉమ్మడి కుటుంబంలో వారి ఆధార్ నెంబర్లు అనుగుణంగా సర్వేలో వివిధ ఐడిలు కేటాయించారని తెలిపారు. ఇంటి పెద్ద ఆధార్ నెంబర్ కిందనే సభ్యులందరూ ఉండడంతో ఇంటి యజమానికి ఏ పథకం వర్తించకుండా పోతున్నదని తెలిపారు.

ట్రాఫిక్ సమస్యపై డిఎస్‌పికి వినతి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ప్రొద్దుటూరు ట్రాఫిక్ సమస్యలపై డిఎస్‌పి కార్యాలయంలో మంగళవారం ఎంపిజె నాయకులు డిఎస్‌పి గౌస్‌పీరా భావనకు వినతిపత్రమిచ్చారు. ఎంపిజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, రాయలసీమ ఇన్‌ఛార్జి ఎండి అయూబ్ ఖాన్, సభ్యులు పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై వివరించారు. సిగ్నల్ పడినా వెహికల్స్ వెళుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. యువత రాత్రి సమయంలో బైక్ రైడింగ్ చేస్తూ కేకలు అరుపులతో వీధివాసులను భయభ్రాంతులకు చేస్తున్నారన్నారు. ఉదయం పూట పాత బస్టాండ్ దగ్గర దూర ప్రాంతాల నుంచి వచ్చిన బస్సులకు ఆటోలు ఒకరి తర్వాత ఒకరు వచ్చి అడ్డదిడ్డంగా పెట్టి ట్రాఫిక్‌ను స్తంభింపజేస్తున్నారని వివరించారు. వీటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిఎస్‌పిని కోరారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు గజ్జల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపిజె జిల్లా అధ్యక్షులు జాకీర్ ఉమ్రి, పట్టణ అధ్యక్షులు హుస్సేన్ బాషా, ఉపాధ్యక్షులు నజీర్ అహమ్మద్, సభ్యులు ముక్తియార్, అల్లా బకాష్, కమల్ బాషా, ఫరాన్ పాల్గొన్నారు.

పిల్లగుట్ట కాలనీలో తాగునీటి సమస్య

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక గండి రోడ్డులో ఉన్న పిల్లగుట్ట స్వామి కాలనీలో తాగునీటి సమస్య నెలకొంది. వైసిపి ప్రభుత్వ పాలనలో పిల్లగుట్టలో ఇంటి నిర్మాణాలు చేసి కాలనీని ఏర్పాటు చేశారు. గత నెల నుంచి కాలనీకి తాగునీటి సరఫరా కాకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నట్లు ఆ కాలనీ ప్రజలు వాపోతున్నారు. తాగునీటి సమస్యపై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తాగునీటి సమస్య దినదిన గండంగా మారిందని పేర్కొంటున్నారు. గత నెల నుండి పిల్లగుట్ట కాలనీకి తాగునీటి సమస్య ఉందని చెప్పినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా చెప్పారు. కాలనీలు ఏర్పాటు చేసినప్పుడు అందుకు తగ్గట్టుగానే ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత తీసుకోవాలని తెలిపారు. తాగునీరు సరఫరా చేయాలని కోరితే గుట్ట మీదకు నీరు ఎక్కాలంటే కష్టం పెద్ద మోటర్లు వేసుకోవాలని, చిన్న మోటర్లు వేసుకొంటే నీళ్ల ఎక్కువని ఆ కాలనీ వాసులకు ఉచిత సలహాలిస్తున్నట్లు తెలిపారు.

చుక్క నీరు రాలేదని చూపుతున్న కాలనీ వాసులు

నీరు రాకపోవడంతో కింద నుంచి పైకి తాగునీటిని బిందెలతో మోసుకొంటున్నట్లు ఆ కాలనీ ప్రజలు అంటున్నారు. కుళాయి పైపులకు చుక్క నీరు రావడం లేదని అంటున్నారు. తాగునీరు సరఫరా చేయాలని పంచాయతీ సిబ్బందికి ఫోన్లు చేసినా పట్టించుకోవడం లేదని వాపో తున్నారు. పంచాయతీ సిబ్బంది వస్తారు.. పోతారు తప్ప ఏమీ ఫలితంలేదని అంటున్నారు. కాలనీలో ఉన్న వారందరు కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్న వారే. తాగునీటి కోసం పనులు విడిచి పెట్టాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి రాక ముందే తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. తాగునీటి కోసం ఎక్కువ నిధులు ఖర్చు చేయాలని జిల్లా అధికారులు చెబుతున్నా, ఆచరణలో అది అమలు కావడంలేదని అంటున్నారు. ఇకనైనా అధికారులు చర్యలు తీసు కోవాలని స్థానికులు కోరుతున్నారు. తాగునీటి సమస్యపై పంచాయతీ కార్య దర్శిని వివరణ కోరగా పిల్లగుట్ట కాలనీకి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అధికార యంత్రాంగం ఉన్నా ప్రయోజనం లేదు

అధికార యం త్రాంగం ఉండి కూడా తాగునీటి సమస్య పరి ష్కరించ డంలో విఫలం అవుతు న్నారు. నెల రోజుల నుండి తాగునీరు ఇబ్బందులు ఉన్నాయని పిల్లగుట్ట కాలనీ ప్రజలు చెబుతున్నా.. అధి కారులకు పట్టించుకోక పోవ డం దారుణం. వైసిపి పాలనలో నిర్మించిన జగన్ కాలనీల్లో అన్ని సమస్యలే. తాగునీటిని అందించాల్సిన బాధ్యత ఉందన్నారు.

- రహంతుల్లా, ఆప్ జిల్లా కో-ఆర్డినేటర్

సూపర్‌సిక్స్ పేరుతో మోసం : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ ఎక్కడ ఉందని, సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేశారని, హామీలు ఇవ్వలేనని బాబు చేతులెత్తేసారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. జూదం, ముగ్గురాయి, వైసిపి నాయకులపై కక్ష సాధింపు విషయాల్లో స్థానిక టిడిపి నాయకులు బిజీగా ఉన్నారని తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక దోపిడీలు పెరిగాయన్నారు. రాష్ట్రం అప్పులో ఉందంటూ ఏ పథకం ఇవ్వలేమంటూ చంద్రబాబు చేతులెత్తేశారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చే విషయంలో విఫలమయ్యారన్నారు. పులివెందుల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాల్లో జూదం భారీగా జరుగుతోందని, స్థానిక అధికార పార్టీ నాయకులకు రోజుకు రూ.10 లక్షల ఆదాయం వస్తోందని ఎంపీ ఆరోపించారు. జూదానికి అలవాటై డబ్బులు పోగొట్టుకున్న వారు దొంగతనాల వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతు చేయక లింగాల మండలం రైతులకు నీళ్లు అందలేదన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

రెండుమూడు రోజుల్లోనే వాటికి మరమ్మతులు పూర్తవుతాయని, యథాస్థానంలో ఉంచి రైతులకు నీళ్లు అందించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రిలిమ్స్ పరీక్షలలో అర్హత సాధించిన పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులందరికీ ఫిజికల్ ఈవెంట్స్‌లో అవకాశం కల్పించి వారికి న్యాయం చేయాలని లేని పక్షంలో నిరుద్యోగుల పక్షాన ఆందోళనలు తీవ్రతరం చేపడుతామని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి ముడియం చిన్ని, వీరణాల శివకుమార్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం కడపలో ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్ 2022, నవంబర్ 28న 6100 పోస్టులకు విడుదల చేసిందని తెలిపారు. రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున అభ్యర్థులకు వయోపరిమితి పెంచాలని అనేక పోరాటాలు చేసి రెండేళ్ల సాధించుకున్నామని చెప్పారు. 2023, జనవరి 22న ప్రిలిమ్స్ పరీక్షకు 4 ,59,182 మంది హాజరయ్యారని తెలిపారు. ప్రిలిమ్స్ పరీక్షలలో 95 208 మంది అర్హత సాధించారని ఈలోగా ఎమ్మెల్సీ ఎన్నికలు, కోర్టు కేసులు ఫలితంగా రెండేళ్లు నుంచి ప్రభుత్వం వాయిదా వేస్తూ వచ్చారని పేర్కొన్నారు. ఇప్పుడు ఫిజికల్ ఈవెంట్స్‌కు వయసు లేదని అభ్యర్థులను తిరస్కరించడం అన్యాయమని విమర్శించారు. పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 20వేల పోస్టులను భర్తీ చేయాలన్నారు. హోంగార్డ్ రిజర్వేషన్లు తగ్గించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని తెలిపారు. ప్రభుత్వం పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు సకాలంలో ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించకుండా నిర్లక్ష్యం చేసి తిరిగి నిరుద్యోగులనే బలి చేయడం సిగ్గు చేటన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ప్రీ లిమ్స్ పరీక్షలు అర్హత సాధిం చిన ప్రతి ఒక్కరిని ఫిజికల్ ఈవెంట్స్‌కు అనుమతించాలని కోరారు. లేనిపక్షంలో డివైఎఫ్ఐ, యువజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఫిజికల్ ఈవెంట్స్ లో భాగంగా 1600 మీటర్లు పరుగు చేసే సమయంలో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురు చనిపోయారని వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు రెబ్బా.నరసింహులు,నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : రాష్ట్ర ప్రభుత్వం ఫిలిమ్స్ పరీక్షలో అర్హత సాధించిన పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులందరికీ ఫిజికల్ ఈవెంట్స్‌లో అవకాశం కల్పించి, వారికి న్యాయం చేయని పక్షంలో నిరుద్యోగుల పక్షాన ఆందోళనలు తీవ్రతరం చేస్తామని డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరీ కుమార్, విశ్వనాథ్ కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ నాయకులు చిన్న పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఫిలిమ్స్ పరీక్షలలో అర్హత సాధించిన పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులందరికీ ఫిజికల్ ఈవెంట్స్‌లో అవకాశం కల్పించాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్ కోరారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. సమావేశంలో డివైఎఫ్ఐ పట్టణ సహాయ కార్యదర్శి మహేష్ యాదవ్, నాయకులు సురేంద్రరెడ్డి, సాయి పాల్గొన్నారు.

మండల సమావేశానికి అధికారులు డుమ్మా

పారిశుధ్యంపై సభ్యులకు వివరణ ఇస్తున్న ఇఒపిఆర్‌డి మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజా సమస్యలతోపాటు ప్రభుత్వం అమలు చేసే పథకాలు అమలుపై జరిగే సమీక్షా సమావేశానికి కొందరు మండలస్థాయి అధికారులు డుమ్మా కొట్టారు. ప్రజాప్రతినిధులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పే అధికారులు లేకపోవడంతో తూతూ మంత్రంగా మండల సమావేశం జరిగింది. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమీపంలో ఉన్న వైఎస్ఆర్ సభా భవనంలో మండల ఉపాధ్యక్షులు రమణమ్మ, మేహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేంపల్లెలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని ఎంపిటిసిలు పద్మా జయలక్ష్మి దేవి, బ్రహ్మయ్య, హబీబుల్లా, మణి గోపాల్‌రెడ్డి, కటిక చంద్రశేఖర్, భారతి అధికారులపై మండిపడ్డారు. పాపాఘ్ని నది నుండి ప్రజలకు తాగునీరు అందించడంలో కూడా అధికారులు విఫలమయ్యారని సభ్యులు ఆరోపించారు. పారిశుధ్యం, తాగునీరు సరఫరాపై చర్చించేందుకు ఎంపిటిసి సభ్యులకు పంచాయతీ సిబ్బందికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని ఎంపిడిఒ కుళాయమ్మ తెలిపారు. మూడు నెలలకొసారి జరిగే సమావేశానికి విలేకరులకు సమాచారం ఇవ్వకపోవడం మంచి పద్ధతి కాదని సభ్యులు పేర్కొన్నారు. దీనిపై జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి కూడా అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని రవికుమార్‌రెడ్డి కోరారు. సమావేశంలో తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి, ఐసిడిఎస్ సిడిపిఒ సునీత, అగ్రికల్చర్ ఎఒ రాజేంద్రప్రసాద్, ఇఒపిఆర్‌డి మల్లికార్జునరెడ్డి, హౌసింగ్ ఎఇ యోగీశ్వరరెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒకటి నుంచి ఉచిత ఆర్‌ఆర్‌బి గ్రూప్ డి కోచింగ్

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

జన విజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలో ఆర్‌ఆర్‌బి గ్రూప్ డి ఉచిత కోచింగ్‌ను ఫిబ్రవరి 1 నుండి అందిస్తున్నామని జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జెవివి పట్లణ ఉపాధ్యక్షులు వేంపల్లి రాజశేఖర్, పట్టణ కార్యదర్శి సునీత తెలిపారు. స్థానిక జెవివి కార్యాలయంలో మంగళవారం కోచింగ్‌కు చెందిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఆసక్తి గల వారు 97053 33305కు ఫోన్ చేసి తమ పేరును రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి - వేముల

వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఈ పాఠశాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి దాదాపు 550మందికి పైగా విద్యార్థులు వస్తుంటారు. పాఠశాలలో శుద్ధి చేసిన తాగునీరు, కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డు మీద ఉన్న వాటర్ ప్లాంట్ వద్దకు వెళ్లి లీటర్ వాటర్ బాటిల్ ద్వారా తెచ్చుకుంటున్నారు. భోజనం సమయంలో తాగడానికి నీరు లేక నిల్వచేసిన డ్రమ్ములలోని నీరు తాగుతూ కాలం గడుపుతున్నారు. విద్యార్థులు భోజనం పూర్తి చేసుకున్న తర్వాత ప్లేట్లు క్లీన్ చేసుకోవడానికి, తాగడానికి డ్రమ్ము వాటర్‌ని ఉపయోగిస్తున్నారు. గతం లో పాఠశాలకు దాతల సాయంతో ప్యూరిఫై డ్రింకింగ్ వాటర్ ప్లాంట్‌ను అంద జేయగా.. కొన్ని నెలల నుంచి అది పనిచేయలేదు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. జిల్లాస్థాయి అధికారులు స్పందించి పాఠశాల సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

రైతు ఆత్మహత్యలపై ఆర్‌డిఒ విచారణ

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ఆయా గ్రామాల్లో ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్య విచారణ చేపట్టారు. మండలంలోని అలవలపాడు గ్రామానికి చెందిన ఎద్దుల సాంబశివరెడ్డి, రామిరెడ్డిపల్లిలో శ్రీనువాసులరెడ్డి, వేంపల్లె క్రిష్టియన్ కాలనీలో గూడూరు ఆశీర్వాదం అనే రైతులు అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయా గ్రామాల్లో ఆర్‌డిఒ చిన్నయ్య, తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి వెళ్లి రైతు కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో మాట్లాడారు. పిల్లల చదువులపై అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక పరిస్థితులపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్ఐ లోకేష్, విఆర్ఒ డి.ఓబయ్య, టిడిపి నేతలు జగన్నాథరెడ్డి, నరసింహరెడ్డి పాల్గొన్నారు.

బాధితుడికి న్యాయం చేయండి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని సన్నపల్లె గ్రామంలో జరిగిన చోరీ కేసును ముమ్మరంగా దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి కోరారు. సన్నపల్లె గ్రామానికి వెళ్లి మంగళవారం చోరీకి గురైన బాధితుడు తుమ్మలూరు రవీంద్రారెడ్డిని పరామర్శించారు. చోరీ జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని తెలిపారు. పోలీసులు చోరీ కేసుపై దృష్టి సారించి చోరీ సొత్తు రికవరీ చేసి బాధితులకు అందేలా చర్యలు తీసుకోవాలని తాను పోలీస్‌లను కోరుతున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపిఎస్ఆర్‌టిసి మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, వైసిపి నియోజకవర్గ జాయింట్ సెక్రెటరీ పివి రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, కెసి కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ ఉపాధ్యక్షులు రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి, మిడుతూరు చంద్ర, సుదర్శన్‌రెడ్డి, చిన్న రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజు స్వామి ఊరేగింపు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగులో నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా త్యాగరాజు స్వామి చిత్ర పటాన్ని ఊరేగింపు ఉత్సవం మంగళవారం నిర్వహించారు. ముందుగా శ్రీనారాపుర వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి గ్రామోత్సవం ప్రారంభమైంది. నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి బి. రాజగోపాల్, జిల్లా అధ్యక్షులు గురప్ప, జమ్మలమడుగు పట్టణ అధ్యక్షులు సుబ్బయ్య, నాయి బ్రాహ్మణుల సంఘం మాజీ అధ్యక్షులు, కార్యదర్శులు సభ్యులు, నాయి బ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

వైయస్సార్ జిల్లా కడప కార్పొరేషన్ గౌస్ నగర్ అమీర్ థియేటర్ సమీపంలో ఉండే డోర్ నెంబర్ D:No.16/374-16-3లో ఉండే సయ్యద్ నాగూర్ భాష గారి భార్య సయ్యద్ ఫరీదా గారి ఇల్లు మారుతున్న సందర్భంలో 28-09-2024 తేదీన పాస్‌పోర్ట్ పోయినది. పాస్‌పోర్ట్ నెంబరు **U5952069.** ఎవరికైనా దొరికినచో పైన తెలుపబడిన చిరునామాకు గాని **9014820742** నంబరుకు కాల్ చేసి తెలపగలరు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బి.మనోహర్, పార్టీ నాయకులు

జీపు జాతాను జయప్రదం చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.మనోహర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విభజన చట్టం హామీలో భాగం కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం సిపిఎం చేపట్టిన జీపు జాతను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.మనోహర్ కోరారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో మంగళవారం ఉక్కు సాధన కోసం చేపట్టిన జిల్లా జీపు జాత కరపత్రాలను మనోహర్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కడప ఉక్కు రాయలసీమ హక్కు అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ఉద్యమంలోకి కలసి రావాలని పిలుపునిచ్చారు. ఈనెల 30, 31న రెండు రోజులపాటు జిల్లా వ్యాప్తంగా సిపిఎం జీపు జాత నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో నెల్లూరులో మూడు రోజులపాటు సిపిఎం రాష్ట్ర మహాసభలు జరుగునున్నాయని తెలిపారు. కడప ఉక్కు ప్రధాన డిమాండ్‌తో రాష్ట్ర మహాసభలో చర్చిస్తారని, అందుకు కొనసాగింపుగా జిల్లాలో జీపుజాత జమ్మలమడుగులో ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి జి.ఏసుదాసు, పట్టణ కమిటీ సభ్యులు ఎ.వినయ్‌కుమార్, కమల్‌బాషా, పట్టణ నాయకులు, వెంకటస్వామి, దివాకర్ నన్నే, దస్తగిరి పాల్గొన్నారు.

జంతువుల సంచారాన్ని నివారించాలని వినతి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు పట్టణ పరిధిలోని ప్రధాన రోడ్లు, వార్డు వీధులు, గ్రామాల్లో ప్రజల మధ్య తిరుగుతూ వారికి ప్రాణ హాని కలిగిస్తున్న కుక్కలు, పందులు, కోతులు, ఆవులను నివారించాలని రైతు సేవా సమతి జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ కోరారు. ఆ మేరకు

వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

మంగళవారం మైదుకూరు మున్సిపల్ కమిషనర్ శ్రీనువాసుల రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ పట్టణ పరిధిలో జంతువుల సమస్యలను పరిష్కరిం చాల న్నారు. ప్రధాన రోడ్ల వెంబడి ఆక్రమణలను మట్టిని తొలగింపు చర్యలు చేపట్టా లన్నారు. నడక ప్రయాణికులకు ప్రాణ నష్టం జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టక పోతే రైతు సేవా సమితి నాయకత్వంలో పట్టణ ప్రజలు, ప్రజా సంఘాలతో కలిసి మరింత స్థాయిలో నిరసన చేపడతామన్నారు. రైతు సేవా సమితి నియో జకవర్గ నాయకులు రామ్మోహన్, సభ్యులు చొక్కం సంజీవ రాయుడు, షామీర్ బాషా, రామాంజనేయరెడ్డి, పిండి మిషన్ సుబ్బరాయుడు, చొక్కం నారాయణ, బిఎల్ రామ్మూర్తి, దాశరెడ్డిగారి సుబ్బరాయుడు, కోటయ్యగారి గురప్ప పాల్గొన్నారు.

పశువుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చాపాడు

రానున్న వేసవి సీజన్‌లో పశువుల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలని జమ్మలమడుగు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.వీరబ్రహ్మం సూచించారు. మండలంలోని నరహరిపురంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని మండల వైద్యాధికారి మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ రాబోయే వేసవి సీజన్‌లో పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ప్రస్తుతం అందుబాటులో ఉన్న పశుగ్రాసాన్ని నిల్వ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మైదుకూరు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ గురివిరెడ్డి, విఎల్ఒ వెంకటేశ్వర్లు, జెవిఎ చలపతి, ఎహెచ్ఎ విష్ణుప్రియ, మహబూబ్ హుస్సేన్, దస్తగిరి, అమర్నాథ్, సిబ్బంది రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవాలి

- సీనియర్ బ్రాంచ్ మేనేజర్ కృష్ణారెడ్డి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకొని నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ కృష్ణారెడ్డి సూచించారు. మహాత్మ జ్యోతిబా పూలే బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం ఆర్థిక నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్‌బిఐ సహకారంతో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ వి.నిర్మల, హెర్డ్స్ సంస్థ అధ్యక్షుడు కృష్ణయ్య యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛనుదారులకు ఆరోగ్య పరీక్షలు

ముద్దనూరు : సామాజిక పింఛన్లు పొందుతున్న వారి ఆరోగ్య పరీక్షలు మంగళవారం కడపకు చెందిన వైద్యులు డాక్టర్ ఇ.వెంకటభరత్, డాక్టర్ బిల్వత్స్ సూర్యనాయక్, ముద్దనూరు పిహెచ్‌సి డాక్టర్ శ్రీకాంత్ నిర్వహించారు. మండల వ్యాప్తంగా 16 మంది పింఛన్‌దారులను ఇంటింటికి వెళ్లి తనిఖీ చేసినట్లు వైద్యులు తెలిపారు. శెట్టివారిపల్లి గ్రామ పంచాయతీలో 5, యామవరం గ్రామ పంచాయతీలో 3, తిమ్మాపురం గ్రామ పంచాయతీలో 4, ముద్దనూరు గ్రామ పంచా యతీలో 4 పింఛన్లు తనిఖీ చేసినట్లు చెప్పారు. ఇఒపిఆర్‌డి కె.వీరభద్రుడు, సూపర్ వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఆయా పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో దారి దోపిడీలా పాలన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గత వైసిపి ప్రభుత్వంలో పాలన దారి దోపిడీ దారుల మాదిరి సాగిందని టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత అయిదేళ్లలో ఆర్‌బికె టీం కొనసాగించిన అక్రమాలపై ప్రశ్నించామన్నారు. అం దుకు తనను ప్రముఖ న్యాయవాది రామ్ జఠ్మలానీతో పోల్చారని, సమస్య తన వృత్తి గురించి కాదని, ఆర్‌బికె పేరుతో పంచాయతీలు, బెట్టింగ్, ఉద్యోగాలు, సర్వ సేనాధి పతి మట్కా, గుట్కా, ఇసుక, రియల్ ఎస్టేట్, కబ్జా, ఇతరత్ర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడ్డారన్నారు. కౌన్సిలర్ మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ బంగారురెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి తనపై ఆరోపణలు చేశారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దస్తగిరి పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.A.No.548/2019
E.P.No. /2019
O.S.No. 261/2001

Between:
మానికింద ఖాదర్‌బాషా, S/o హుసేనయ్య, వయస్సు 38 సం॥లు, హిందు, వ్యవసాయం, R/o టంగుటూరు గ్రామం, రాజుపాళెం మండలం, కడప జిల్లా.
...పిటీషనరు/డి. హెచ్ఆర్

Vs

6. కరుమంచి పిచ్చయ్య, Further name not known, R/o మూడుమాన్లు దగ్గర, శ్రీనివాసనగర్, ప్రొద్దుటూరు టౌన్ & మండలం, కడప జిల్లా.
7. కరుమంచి దస్తగిరి, S/o పిచ్చయ్య, 25 సం॥లు, R/o మూడుమాన్లు దగ్గర, శ్రీనివాసనగర్, ప్రొద్దుటూరు టౌన్ & మండలం, కడప జిల్లా.
8. మానికింద పెద్ద దస్తగిరి, S/o చిన్న పుల్లయ్య @ చిన్న హుసేన్, వయస్సు 52 సం॥లు, R/o D.No.9/243, ఈశ్వర రెడ్డి, సోములవారిపల్లె గ్రామం, ప్రొద్దుటూరు మండలం, కడప జిల్లా.
10. దుర్గం దస్తగిరమ్మ, W/o మహబూబ్‌బాష, వయస్సు 45 సం॥లు, R/o D.No.15/49, పెన్నానగర్, సోములవారిపల్లె గ్రామం, ప్రొద్దుటూరు మండలం, కడప జిల్లా.

NOTICE

పై నెంబరు పిటీషను దూదేకుల హుసేనమ్మ గారు చనిపోయినందున ఆమె తరపున 6,7,8,10 రెస్పాండెంట్లుగా పై నంబరు పిటీషన్‌లో చేర్చుకొనుటకు గాను దాఖలు చేయు మెమో. అట్టి పిటిషన్‌లో మీకేమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టులో 13.02.2025వ తేదీన ఉదయం 10.30 గంటలకు ప్రొద్దున గాని, వకీలు ద్వారా గాని తెలుపుకొనవలెను. లేనియెడల మిమ్ములను పరోక్షమున ఎక్సుపార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేది: 13.02.2025

//By Order of the Court//
సి.శ్యామ సుందర రెడ్డి,
వి. నంద కిషోర్ రెడ్డి,
అడ్వకేట్స్, ప్రొద్దుటూరు.